క్లుప్తంగా

రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెండో డివిజన్ కార్పొరేటర్ బి. ఆనంద్ అన్నారు. గురువారం స్థానిక విజయ బ్లడ్ బ్యాంక్‌లో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, సాయినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం



భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల రూరల్: భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ సుదర్శన రావు సూచించారు. మండలంలోని బొప్పడాం గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందుకోసం బొప్పడాం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ సత్యనారాయణ, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికి పనులు పూర్తి

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య




నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సీసీ రహదారులు, పైప్‌లైన్ పనులను గమనించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ధ్యేయంతో పని చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఈ మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల: ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ అన్నారు. పట్టణంలోని మిమ్స్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ర్యాగింగ్ వల్ల జరిగే అనర్థాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను పూర్తిస్థాయిలో రూపుమాపడానికి ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టం అమల్లోకి తీసుకువచ్చిందని చెప్పారు. విద్యార్థులంతా స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, హోమియో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమలులో ఎన్నికల కోడ్

విజయనగరం: ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నిక సందర్భంగా నగరంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగాలని పట్టణ ప్రణాళికా సిబ్బందిని గురువారం ఆదేశించారు. దీంతో సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న రాజకీయ నాయకుని విగ్రహానికి తొడిగి ఉన్న ముసుగు



కోట జంక్షన్‌లో ఉన్న రాజకీయ నాయకుని విగ్రహానికి వేసిన ముసుగు

రైతులకు ప్రోత్సాహం కరువు..

- చిన్న చిన్న కారణాలకే రైతులను సస్పెండ్ చేస్తున్నారు
- ఇటీవల ఇద్దరు రైతులను ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో సస్పెండ్ చేసిన వైనం
- హడలిపోతున్న రైతులు
- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న అధికారి ..?



ఆర్అండ్‌బీ రైతుబజార్

విజయనగరం ఫోర్ట్: ఐడీ కార్డు మెడలో వేసుకోలేదనే నెపంతో ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో ఓ మహిళా రైతును వారం రోజుల పాటు సస్పెండ్ చేశారు. దీంతో ఆమె కూరగాయాలు అమ్ముకోలేక వారం రోజుల ఆదాయాన్ని కోల్పోయింది.. మరో రైతును కూడా షాపులో అతను బదులు కొడుకు ఉన్నాడని నెపంతో వారం రోజులు సస్పెండ్ చేశారు. దీంతో ఇతను కూడా వారం రోజుల ఆదాయాన్ని కోల్పోయాడు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో రైతులను సస్పెండ్ చేస్తుండడంతో రైతులు, వాణిజ్య దుకాణాలు నిర్వహించే వ్యాపారులు హడలిపోతున్నారు. చిన్న చిన్న కారణాలకు సైతం సస్పెండ్ చేస్తుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. రైతుబజార్‌లో కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం, ఉల్లిపాయలు విక్రయించుకునే రైతుల పట్ల ఓ అధికారి తన ప్రతాపాన్ని చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎటువంటి తప్పిదాలు లేకపోయినా ఎదో ఒక కారణం చెప్పి రైతులపై తన ప్రతాపం చూస్తున్న అధికారి తీరును పలువురు తప్పుపడుతున్నారు.

అధికార పార్టీ అండతో..

మార్కెటింగ్ శాఖకు చెందిన ఓ అధికారి అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్నరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు అధికార పార్టీ అండ ఉందని.. తనను ఎవరూ ఏమీ చేయలేరని సదరు అధికారి రైతులతో దురుసుగా మాట్లాడుతున్నారన్న విమర్శలున్నాయి.

విమర్శల వెల్లువ..

రైతులు కష్టపడి పండించిన కూరగాయలు, ఆకుకూరలను రైతుబజార్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. కుటుంబాలను పోషించుకోవడానికి ఈ ఆదాయమే వారికి ఆధారం. అటువంటి రైతులను ప్రోత్సహించాల్సిన అధికారులు తిరిగి వారిని వేధిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుబజార్లలో ఇటువంటి చర్యలు సరి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

– బి.రవికిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్, మార్కెటింగ్ శాఖ



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

అవగాహన తప్పనిసరి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

- డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: కుష్టు వ్యాధిపై ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ జీవనరాణి తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్టువ్యాధిపై నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధిపై ప్రజలకు ఉన్న అపోహలను తొలిగించాలన్నారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలను కుష్టుగా అనుమానించి, వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాణి, డీఐఓ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ, డాక్టర్ అర్చన, సర్వజన ఆస్పత్రి డెర్మాటాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అజయ్‌కుమార్, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి రహిత సమాజమే లక్ష్యం..

నెల్లిమర్ల: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ది లెప్రసీ మిషన్ ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో నెల్లిమర్ల నగర పంచాయతీలో గల ఆదిత్య విద్యాలయం పాఠశాలలో కుష్టువ్యాధి నివారణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సై బి.గణేష్, హీల్ ప్రాజెక్ట్ మేనేజర్ కిష్మత్ నంద మాట్లాడుతూ.. కుష్టువ్యాధి బారిన పడిన ప్రజల సంరక్షణ కోసం మహాత్మాగాంధీ ఎంతో కృషి చేశారన్నారు. అందుకే ఆయన వర్ధంతి రోజున కుష్టు నివారణ దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వి. సూరిబాబు, హెచ్ఎం వి.అమృత, ప్రాజెక్ట్ ప్రతినిధులు డాక్టర్ తాలాడ దీప్తి, సీడీఓ వంశీ, అనిల్ మనోజ్, మెహతార్ సహోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ సభ్యులు



విజయనగరం అర్బన్: ఎంఆర్ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ జనార్దననాయుడు, తదితరులు

స్ఫూర్తి ప్రదాతకు నివాళులు..

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ జీవితచరిత్రను వక్తలు వివరించారు. సత్యం, అహింసను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. అహింస అనే ఆయుధంతో ఎన్నో విజయాలు సాధించిన మహనీయుడని కొనియాడారు. మహాత్మా గాంధీ ఒక్క భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికే స్ఫూర్తి ప్రదాత అని అభిప్రాయపడ్డారు.

– విజయనగరం టౌన్/విజయనగరం/విజయనగరం అర్బన్



విజయనగరం: సాయికృష్ణా వాకర్స్‌క్లబ్ నడక మైదానంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు



విజయనగరం అర్బన్: పట్టణ వీధుల్లో గాంధీ వేషధారణతో విద్యార్థుల శాంతి ర్యాలీ

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

- నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని మోపాడలో గురువారం ఏర్పాటు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు హామీలు అమలు చేయలేమని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 2014లో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి అన్నదాతలను మోసం చేశారని ఆరోపించారు. 2024 ఎన్నికల ప్రచారంలో రాష్ట్రం అప్పులపలైందని ఓ వైపు గ్లోబల్ ప్రచారం చేస్తూ.. మరోవైపు సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని గొంతు చించుకునే విధంగా ఎలా ప్రచారం చేశారో ఆయనకే తెలియాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ప్రజలను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. తక్కువ కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వచ్చిందన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో కేవలం తక్కువ నిధులే ఉన్నప్పటికీ.. ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేశారని కొనియాడారు. కోవిడ్ సమయంలో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కూటమి సర్కారు పాలనను ఆంధ్రప్రదేశ్ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

వీధి విక్రయాల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు



వీధి విక్రయదారులతో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: వీధి విక్రయాల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు పలువురు వీధి విక్రయదారులతో గురువారం ఆయన తన కార్యాలయంలో సమావేశమై పలు సూచనలు చేశారు. రహదారులను ఆక్రమించి విక్రయాలు చేపట్టరాదని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలలో మాత్రమే తోపుడుబళ్లను నిలుపుకుని వ్యాపారాలు చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారులు కూడా క్రమపద్ధతిలో తోపుడు బళ్లను నిలుపుకుని, సూచించిన ప్రదేశాలలో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా కేంద్రాస్పత్రి (జీజీహెచ్) ఆవరణలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో గత నెలలో కేంద్రాస్పత్రిని సందర్శించి తయారు చేసిన ప్రత్యేక నివేదికను ఎమ్మెల్యే సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రాస్పత్రిలో రోగులకు అనుకున్నంత స్థాయిలో సేవలు అందడం లేదని, ఇరుకు గదుల్లో రోగులు, డాక్టర్లు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు, సహాయకులు మంచి భోజనం దొరకక ఇబ్బంది పడుతున్నారన్నారు. అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్ లేకపోవడం, బెడ్స్ సరిపోకపోవడం, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, ప్రతినిధులు తుమ్మగంటి రామ్మోహనరావు, త్యాడ ప్రసాద్ పట్నాయక్, ఇప్పలవలస గోపి, తాడేపల్లి నాగేశ్వరరావు, థాట్రాజు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పౌరవేదిక ప్రతినిధులు

మొక్కజొన్నలో భాస్వరం లోపం

- ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ లక్ష్మణ్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు లక్ష్మణ్, ఏఓ నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: మొక్కజొన్నలో భాస్వరం లోపం ఉన్నట్లు గుర్తించామని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె.లక్ష్మణ్ అన్నారు. మండలంలోని రెల్లివలసలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్నలో భాస్వరం లోపాన్ని పూడ్చడానికి ఐదు నుంచి పది గ్రాముల 19-19-19 ఎరువును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే మొక్కజొన్నలో కాండంతొలిచే పురుగును గుర్తించామని, దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు నాలుగు కిలోలు వేయాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎంఎంవీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కత్తెరపురుగు ఆశించిన పంటకు ఇమామెక్టిన్ బెంజేట్ 80 గ్రాములు, స్పినటోరమ్ 11.7 శాతం ఎస్‌సి 100 ఎంఎల్‌ను ఎకరా పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొల్లి నీలిమ, ఎఫ్‌పీఓ రెల్లివలస సీఈఓ ఎ. ప్రభాకర్, వీఏఏ అనిత, తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు జూట్ మిల్లు యాజమాన్యం గైర్హాజరు

నెల్లిమర్ల: చర్చలకు నెల్లిమర్ల జూట్ యాజమాన్యం గైర్హాజరు కావడం కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద కార్మిక, సంఘాలు, జూట్‌మిల్లు యాజమాన్యం మధ్య గురువారం చర్చలు నిర్వహించగా.. మిల్లు యాజమాన్యం హాజరు కాలేదు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, నామల తిరుపతిరావు, చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ.. అక్రమంగా కర్మాగారానికి లాకౌట్ ప్రకటించిన యాజమాన్యం చర్చలకు డుమ్మా కొట్టడం దుర్మార్గమన్నారు. ఇదిలా ఉంటే చర్చలను ఫిబ్రవరి పదో తేదీకి వాయిదా చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు కొండల కరువులు, సముద్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక ప్రధాన రహదారిలో ఉన్న ఫ్లెక్సీలను గురువారం తొలగించారు. పట్టణవాసులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఆపేశారు..

విజయనగరం ఫోర్ట్: రైతుసేవా కేంద్రాల్లో టార్గెట్ అయిపోయిందని ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు ఆరోపించారు. ఈమేరకు జేసీ సేతుమాధవన్‌కు గురువారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. గంట్యాడ మండలంలోని బోనంగి, వసాది.. ఎస్. కోట మండలంలోని కొట్టాం, తదితర రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదన్నారు.